క్లుప్తంగా

25న జాబ్‌మేళా



జాబ్‌మేళా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: నారాయణపురం, శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏలూరు జిల్లా డిపార్ట్‌మెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్ – సెట్‌వెల్ ఆధ్వర్యంలో అక్టోబర్ 24న కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపల్ డాక్టర్ టీకే విశ్వేశ్వరరావు తెలియజేశారు. డిపార్ట్‌మెంట్ యూత్ సర్వీసెస్ వైపీ గట్టిం ప్రవీణ్ కృష్ణ మాట్లాడుతూ జాబ్ మేళాలో బ్లూ స్టార్, నిప్పాన్ సైకి, కోల్గేట్, పామూలివ్, డైకిన్, డి మార్ట్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఉద్యోగార్థులను ఎంపిక చేసుకుంటారని అన్నారు. ప్రారంభ జీతం రూ.16 వేల నుంచి రూ.20 వేలకు పైగా ఉంటుందని డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన అందరూ ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్లేస్మెంట్ అండ్ ట్రైనింగ్ ఆఫీసర్ డాక్టర్ కొండా రవి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ఉపాధ్యాయులు

పెదపాడు: దాత ఆర్థిక సాయంతో పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు అందించిన తెలుగు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీ వెంకటేశ్వరరావు తెలిపారు. పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మార్చిలో జరిగే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆంగ్ల ఉపాధ్యాయుడు యూవీ సత్యనారాయణ ఆర్థిక సాయంతో తెలుగు స్టడీ మెటీరియల్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రథమ సహాయకురాలు జీ విజయకుమారి, ఎస్ మధుసూధన రావు పాల్గొన్నారు.

25న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ఉంగుటూరు: సీజీఆర్ఎఫ్ / ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో అక్టోబర్ 25 ఉదయం 10 గంటలకు చేబ్రోలు సబ్ డివిజన్ పరిధిలో చేబ్రోలు (నారాయణ పురం) విద్యుత్‌సంస్థ కార్యాలయంలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని సీజీఆర్ఎఫ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు ఎస్. మసిలమణి తెలిపారు. ఉంగుటూరు, నిడమర్రు మండలాల విద్యుత్ వినియోగ దారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కోరారు.

భగవద్గీత శ్లోకాలపై పోటీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత ఆరవ అధ్యాయం ఆత్మ సంయమ యోగము శ్లోకాలపై కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు హిందూధర్మ ప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ బీఎస్ఆర్ సుబ్రహ్మణ్యం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 11 గీతా జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా విద్యార్థులకు వచ్చే డిసెంబర్ 1న, ఆదివారం మొగల్తూరులోని రామాలయంలో, ఏలూరు జిల్లాకు సంబంధించి డిసెంబర్ 8వ తేదీ ఆదివారం జంగారెడ్డిగూడెం కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. జూనియర్ విభాగంలో 6, 7 తరగతుల విద్యార్థులకు, సీనియర్ విభాగంలో 8,9 తరగతుల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతి విభాగానికి సంబంధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.1000, రూ. 750, రూ. 500 నగదు బహుమతులు అందజేస్తామన్నారు. సంపూర్ణ భగవద్గీత కంఠస్థ పోటీలు కూడా ఆయా తేదీల్లో నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు 9492941754 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

చేతి వృత్తిదారులకు నిధులు కేటాయించాలి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చేతి వృత్తిదారులకు ఎటువంటి సంక్షేమ కార్యక్రమాలూ చేపట్టలేదని ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కడుపు కన్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ చేతి వృత్తి దారుల సమాఖ్య రాష్ట్ర పిలుపులో భాగంగా మంగళవారం చేతి వృత్తిదారుల సమాఖ్య ఏలూరు జిల్లా సమితి నాయకులు బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్ పుష్పలతకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర జనాభాలో 30 శాతం వరకు ఉన్న చేతి వృత్తిదారులకు రాష్ట్ర బడ్జెట్లో 25 శాతం నిధులు కేటాయించాలని కన్నయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా చేతి వృత్తిదారులకు రూ.5 లక్షలు తగ్గకుండా 50 శాతం సబ్సిడీతో రుణాల అందించాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, బళ్ల కనకదుర్గారావు ఉన్నారు.

అరకొరగా ఆర్టీసీ బస్సు సర్వీసులు

- పెదపాడు మండలంలోని 18 గ్రామాల ప్రజలకు ఇక్కట్లు
- ఏలూరు, హనుమాన్ జంక్షన్‌కు ప్రైవేటు వాహనాలే దిక్కు



ఆర్టీసీ బస్

పెదపాడు: ఆర్టీసీ సేవలు పెదపాడు మండల ప్రజలకు అందని ద్రాక్షలా మారాయి. అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా ప్రయాణికుల సమస్యలు తీరడం లేదు. పెదపాడు మండలంలోని డెల్టా ప్రాంతంలో 18 గ్రామాలకు 3 బస్సులు మాత్రమే ఉన్నాయి. 18 గ్రామాల నుంచి సుమారు 50 వేల మంది ఏలూరు జంక్షన్‌కు నిత్యం ప్రయాణిస్తుంటారు. గతంలో ప్రతి 10 నిమిషాలకు పెదపాడు నుంచి ఏలూరుకు, పెదపాడు నుంచి హనుమాన్ జంక్షన్‌కు ఆర్టీసీ బస్ సౌకర్యం ఉండేది. మండల కేంద్రం మీదుగా సత్యవోలు, కుదరవల్లి, వడ్డిగూడెం, గుడిపాడు, రాజుపేట, గోగుంట, జయపురం, వీరమ్మకుంట గ్రామాలకు బస్ సౌకర్యం ఉండేది. వీటన్నింటినీ ఆర్టీసీ అధికారులు నిలుపుద చేయడంతో ప్రస్తుతం బస్ సౌకర్యం లేక మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు. గోగుంట, కుదరవల్లి, గుడిపాడు గ్రామాలకు ఉదయం ఒకసారి, సాయంత్రం ఒకసారి మాత్రమే బస్సులు నడుపుతున్నారు. మిగతా సర్వీసులన్నీ ఆర్టీసీ యాజమాన్యం నిలుపుదల చేసింది. దీంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

ఆటోవాలాల చార్జీల బాదుడు

హనుమాన్ జంక్షన్ వెళ్లాలంటే 7కిలోమీటర్లు దూరానికి ప్రయాణికులు ఆటోలో వెళ్లేందుకు రూ. 40 చెల్లించాల్సి వస్తోంది. ఏలూరుకు 10 కిలోమీటర్ల దూరానికి ఆటోవాలాలు రూ. 30 వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. సత్యవోలుకు రూ.40 ఇలా ఆటోవాలాలు చార్జీల మోత మోగించడంతో ప్రజల జేబులు ఖాళీ అవుతున్నాయి. ప్రత్యేకంగా సర్వీసులు ఏర్పాటు చేసే అవకాశం లేకుంటే ఏలూరు నుంచి గుడివాడ, మచిలీపట్నం, విజయవాడ, నూజివీడు వెళ్లే సర్వీసులను పెదపాడు మీదుగా నడపాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఏలూరు నుంచి విజయవాడకు వెళ్లే స్థానిక ప్రయాణికులు సమస్యలను పట్టించుకోవాలని ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.

బస్ సర్వీసులు ఏర్పాటు చేయాలి

హనుమాన్ జంక్షన్‌కు వెళ్లాలంటే ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆటోకు 6 కిలోమీటర్ల నుంచి 8 కిలోమీటర్లకు రూ.40 వసూలు చేస్తున్నారు. సమయానికి ఆటోలు కూడా ఉండటం లేదు. అధికారులు స్పందించి బస్ సర్వీసు ఏర్పాటు చేయాలి.

– పి సురేష్, పెదపాడు

తప్పనిసరి పరిస్థితిలో ఆటోల్లో ప్రయాణం

ఏలూరు వెళ్లాంటే ఆటోలపై ప్రయాణించాల్సి వస్తోంది. ఆటో నిండే వరకు ముందుకు కదలకపోవడంతో వేచి ఉంటున్నాం. సమయం వృథా అవుతోంది. ఆటోల్లో కిక్కిరిసి ప్రయాణికులను ఎక్కించినా తప్పనిసరి పరిస్థితిలో ప్రయాణించాల్సి వస్తోంది. ఉదయం, సాయంత్రం ఒక్కో ట్రిప్పు మాత్రమే ఆర్టీసీ బస్సు వస్తోంది. పూర్తిస్థాయిలో బస్‌సౌకర్యం ఏర్పాటు చేయాలి.

– వి.వెంకట్, పెదపాడు

పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలి



ఎస్ఎంసీ సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం బాలభాస్కర్

గణపవరం: పాఠశాల అభివృద్ధిలో ఎస్ఎంసీ సభ్యులు భాగస్వాములు కావాలని, దాతలు తమ వంతు సహకారం అందించాలని గణపవరం బాలికోన్నత పాఠశాల హెచ్ఎం బాల భాస్కర్ అన్నారు. మంగళవారం పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ కె.సత్యనారాయణమూర్తి పాఠశాలకు క్లబ్ తరఫున సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. వివేకానంద సేవాసమితి అధ్యక్షుడు ఎ.గంగరాజు పాఠశాలలో పచ్చదనం పెంపునకు, పరిశుభ్రత బాధ్యతను తీసుకుంటానని ప్రకటించారు. గంగరాజును ఎస్ఎంసీ కమిటీలో ఎక్స్అఫీషియో సభ్యుడిగా చేర్చుకుంటున్నట్లు హెచ్ఎం ప్రకటించారు. స్వచ్ఛంద సంస్థ సభ్యుడు అనిల్ మాట్లాడుతూ పాఠశాలకు ఆటసామగ్రిని అందజేస్తానని ప్రకటించారు. ప్రథమ సహాయకురాలు హిమగిరి పాఠశాల విద్యా ప్రగతి, విద్యార్థులకు అందిస్తున్న అదనపు బోధనా తరగతులు తదితర వివరాలను వివరించారు. సమావేశంలో ఎస్ఎంసీ చైర్మన్ ఎం.రత్నకుమారి, పలువురు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా రోడ్డు డివైడర్



సోమవరప్పాడులో డివైడర్‌ను ఢీకొట్టిన టిప్పర్ (ఫైల్)

దెందులూరు: ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్య కారణంగా వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఏలూరు – జంగారెడ్డిగూడెం రోడ్డులో సోమవరప్పాడు గ్రామంలో రోడ్డుకు రెండు వైపులా డివైడర్ ఉంది. డివైడర్ ప్రారంభం వద్ద సిగ్నల్ లైట్ ఏర్పాటు చేయకుండా డివైడర్ మధ్యలో సిగ్నల్ లైటు ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులకు డివైడర్ కనిపించడం లేదు. అక్కడి వరకూ వచ్చే వాహనదారులకు తెలిసేలా డివైడర్ ప్రారంభం వద్ద సిగ్నల్ పోల్ ఏర్పాటు చేయకపోవడంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రతిరోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఏలూరు– జంగారెడ్డిగూడెం రోడ్డులో డివైడర్ వద్ద ఆర్అండ్‌బీ అధికారుల తీవ్ర నిర్లక్ష్యాన్ని సోమవరప్పాడు గ్రామ ప్రజలు, ప్రయాణికులు తప్పుపడుతున్నారు. వెంటనే సిగ్నల్ లైటు, పోల్‌ను డివైడర్ ప్రారంభమైన ప్రాంతంలో ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

దెందులూరు ఇన్‌చార్జి ఎఫ్‌డీఓగా సతీష్

దెందులూరు: దెందులూరు మండలం ఇన్‌చార్జి ఎఫ్‌డీఓగా సతీష్ నియమితులయ్యారు. నూజివీడు నుంచి బదిలీపై ఆయన వచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మత్స్యశాఖ లక్ష్యాలకు అనుగుణంగా విధులు నిర్వహిస్తానని ఇన్‌చార్జి ఎఫ్‌డీఓ అన్నారు.

ఆధార్ నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



సత్యనారాయణపురంలోని ఆధార్ నమోదు శిబిరం

దెందులూరు: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఉచిత సేవలందిస్తున్న సిబ్బందికి ప్రజలు సహాయ సహకారాలు అందించాలని దెందులూరు ఎంపీడీఓ కే.శ్రీదేవి అన్నారు. మంగళవారం సత్యనారాయణపురం ప్రాథమిక పాఠశాలలో ఆధార్ నమోదు శిబిరం నిర్వహించారు. ఆధార్‌కు సంబంధించి చేరికలు, మార్పులు, ఇతర అంశాలపై స్థానికులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

విద్యార్థులు భవిష్యత్తుపై దృష్టి పెట్టాలి



విద్యార్థుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నిర్మలకుమారి

గణపవరం: విద్యార్థులు భవిష్యత్తుపై దృష్టి పెట్టి ఏర్పాటు చేసుకున్న లక్ష్య సాధన దిశగా నిరంతరం శ్రమించాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. మంగళవారం కాలేజిలో సెట్వెల్ ఏలూరు, ఎన్ఎస్ఎస్ –1,2 సంయుక్త ఆధ్వర్యంలో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ర్యాగింగ్ నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలో చాలామంది చెడు వ్యసనాలు, చెడు సావాసాలతో క్రమశిక్షణ రాహిత్యంగా ప్రవరిస్తూ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. సెట్వెల్ సీఈవో ప్రభాకరరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఇష్టమైన రంగంలో రాణించేందుకు నిరంతరం శ్రమించాలని సూచించారు. కెరీర్ కౌన్సిలర్ పి.చార్లెస్ విద్యార్థుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. సెట్వెల్ సూపరింటెండెంట్ జాన్‌కెనడీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రామసభలు



కోడూరుపాడు భూ సమస్యలను తహసీల్దార్ బి.రమాదేవి దృష్టికి తీసుకెళ్తున్న రైతులు

భీమడోలు: భూ సర్వేలోని సమస్యల తక్షణ పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహద పడతాయని భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. జిల్లా జేసీ ధాత్రిరెడ్డి ఆదేశాల మేరకు కోడూరుపాడులో మంగళవారం రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. ఈ సభకు సర్పంచ్ మానుకొండ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి రైతుకు చెందిన భూమి వివరాల తెలియజేసేందుకు భూసర్వే ఉపయుక్తంగా ఉంటుందన్నారు. గ్రామసభలో రైతులకు చెందిన భూమి, వాటి విస్తీర్ణాలు తెలుపుతూ జాబితాలను ప్రదర్శించామన్నారు. రైతులు తమ అభ్యంతరాలను లిఖితపూర్వకంగా అధికారుల దృష్టికి తీసుకు వస్తే పక్షం రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. పలువురు రైతులు వినతులు, ఫిర్యాదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పాల్నాటి శ్రీనివాస్, ఆర్ఐ కిరణకుమారి, మండల సర్వేయర్ ధర్మారావు, వీఆర్వోలు సోమయ్య, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యువత వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి



భీమడోలులో ఉద్యోగ మేళాలో నిరుద్యోగులకు సూచనలందిస్తున్న జిల్లా ఇన్‌చార్జి వాడపల్లి కిషోర్

భీమడోలు: విద్యార్థి దశ నుంచి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, తద్వారా ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉంటాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఇన్‌చార్జి వాడపల్లి కిషోర్ అన్నారు. భీమడోలు వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మంగళవారం స్కిల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సంస్థ సీడాప్, జిల్లా ఉపాధి కల్పనా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఉద్యోగ మేళను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా వాడపల్లి కిషోర్ హాజరయ్యారు. ఉద్యోగ మేళాకు 72 మంది హాజరు కాగా వారిలో 16 మందికి ఉద్యోగాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి జే రాము, జిల్లా ఉద్యోగాల కల్పానాధికారి ప్రవీణ్, ఇన్నోవా హెచ్ఆర్ సౌమ్య, కోఆర్డినేటర్స్, యువతీ యువకులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీ



గుండుగొలను బాలికల హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

భీమడోలు: గుండుగొలను, భీమడోలు గ్రామాల్లోని బాలికలు, బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహాలను మంగళవారం ఉమ్మడి జిల్లాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఆకస్మిక తనిఖీలు చేశారు. గుండుగొలనులో బాలికల వసతిగృహం శిథిలావస్థకు చేరడంతో 100 మంది బాలికలను తాత్కాలికంగా గుండుగొలను హైస్కూల్లో ఉంటూ విద్యాభ్యాసం సాగించడాన్ని అక్కడ వార్డెన్ కనకదుర్గ కార్యదర్శి దృష్టికి తీసుకుని వెళ్లారు. వసతి గృహాల్లోని బాలబాలికలకు అందిస్తున్న వసతులను, ఆహార పదార్థాల నాణ్యత, మంచినీటి సదుపాయాలపై ఆయన ఆరా తీశారు. విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వార్డెన్లకు ఆయన సూచించారు. సమస్యలుంటే 15100 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి, తగిన న్యాయం సహాయం పొందాలని ఆయన తెలిపారు.

ఘనంగా పోలీసు అమర వీరుల దినోత్సవం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్

పెదపాడు: పోలీసులు, ప్రజలకు మధ్య స్నేహసంబంధం ఉండాలని పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. మంగళవారం పోలీసు అమర వీరుల దినోత్సవాన్ని స్థానిక పోలీసుస్టేషన్‌లో నిర్వహించారు. ఎస్సై ఆధ్వర్యంలో విద్యార్థులకు పోలీసు విధి, విధానం, వివిధ చట్టాలలు, ఆయుధాల వినియోగంపై అవగాహన కల్పించారు. విద్యార్థుల అడిగిన ప్రశ్నలకు పోలీసులు సమాధానాలు చెప్పారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

ఉంగుటూరు: పల్లె పండుగలో భాగంగా గొల్లగూడెంలో రూ.95 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదార్లకు, రాచూరులో రూ. 45 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారికి మంగళవారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు భూమిపూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, సర్పంచి కరపా శ్రీను, రాచూరులో మంద శ్రీనివాసరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పత్తేపురంలో పల్లె పండుగ

నిడమర్రు: పత్తేపురం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్సు హామీ నెరవేర్చాలి

దెందులూరు: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మహిళలందరినీ మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ దెందులూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆలపాటి నరసింహమూర్తి అన్నారు. మంగళవారం దెందులూరు, మొండూరు, ఇతర గ్రామాల్లో మహిళలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని సూపర్ సిక్స్‌లో హామీ ఇచ్చి గద్దెనెక్కిన తరువాత మహిళలందరినీ చంద్రబాబు మోసం చేశారన్నారు. తక్షణమే ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

98 శాతం పశువుల్లో కృత్రిమ గర్భధారణ

దెందులూరు: పశువులకు 98 శాతం కృత్రిమ గర్భధారణ పూర్తి చేశామని పశుసంవర్థక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ జీ నెహ్రూబాబు అన్నారు. గోపన్నపాలెంలో అగ్రిల్యాబ్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 11 పశువైద్యశాలలు, 66 డిస్పెన్సరీలు, 57 రూరల్ గ్రామీణ వైద్యశాలలు ఉన్నాయన్నారు. ఈ ఏడాది 56,874 పశువులకు కృత్రిమ గర్భధారణ లక్ష్యంగా నిర్దేశించామన్నారు. జిల్లా వ్యాప్తంగా పశువైద్యులు, సిబ్బంది సహాయ సహకారాలతో 37,331 పశువులకు కృత్రిమ గర్భధారణ చేసి రికార్డు నెలకొల్పామన్నారు. కృత్రిమ గర్భధారణ చేయాల్సిన పశు యజమానులు ఆయా గ్రామాల్లో పశువైద్యులు, సిబ్బందిని సంప్రదించాలన్నారు. కృత్రిమ గర్భధారణపై సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో పశు వైద్య సిబ్బందికి రైతులు సహాయ సహకారాలు అందించాలని జేడీ సూచించారు.

సమస్యలపై వినతిపత్రాలు అందజేత

పెదపాడు: సత్యవోలులో మీకోసం– మీ చింతమనేని కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు పలు సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు నిడమర్రు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నిడమర్రు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో విజయకుమారి మంగళవారం తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి అధ్యక్షత వహిస్తారన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

దేవుని ఆజ్ఞలను అనుసరించాలి

దెందులూరు: క్రైస్తవ జీవితం, ఆధ్యాత్మిక చింతన ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయంగా ఉండాలని ఫాస్టర్ జబరాజు అన్నారు. మంగళవారం అప్పారావు పాలెంలో పాస్టర్ ఎలీషా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారం రోజుల ఉపవాస పండుగల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాస్టర్ జబరాజు మాట్లాడుతూ ప్రార్థన అనగా దేవునితో మాట్లాడటమేనని, ప్రతి కుటుంబం దేవుని మార్గంలో పయనిస్తూ ఆయన ఆజ్ఞలను అనుసరించాలన్నారు. ఉపవాస పండుగలకు పెదవేగి, పెదపాడు, భీమడోలు, ఏలూరు మండలాల నుంచి విశ్వాసులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు వేళాయె

- నియోజకవర్గం పరిధిలో 82,356 ఎకరాల ఆయకట్టు
- సాగునీటి సమస్యల పరిష్కారమే పాలకవర్గం విధి



దెందులూరు ఆయకట్టు కెనాల్

దెందులూరు: ఎట్టకేలకు సాగునీటి సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు పచ్చజెండా ఊపింది. దెందులూరు నియోజకవర్గంలో గోదావరి డెల్టా సిస్టమ్ 12,942 ఎకరాలు కృష్ణా డెల్టా సిస్టమ్‌లో 49,890 ఎకరాలు, నాగార్జున సాగర్ లెఫ్ట్ కెనాల్‌లో 3,480 ఎకరాలు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు 16,044 ఎకరాలు, మొత్తం 82,356 ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

ఎన్నిక విధానం

ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన తరువాత తహసీల్దార్ కార్యాలయంలో పొలం ఉన్న రైతులకు అర్హులైన అభ్యర్థులకు ఓటు హక్కు జాబితాను ప్రచురిస్తుంది. వారికి మాత్రమే ఓటు హక్కు ఉంటుంది. నీటి సంఘానికి ఆరుగు సభ్యులు ఉంటారు. పొలం యజమానికి నీటి సంఘం సభ్యత్వం ఉంటుంది. ఆరుగురు సభ్యులు ఎన్నికైన తరువాత వారి నుంచి ఒకరిని ప్రెసిడెంట్‌గా, మరొకరిని వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకుంటారు. మిగిలిన నలుగురు సంఘ సభ్యులుగా ఉంటారు. ఒక్కొక్క నీటి సంఘానికి ఆరుగురు టీసీలు ఉంటారు. దెందులూరు నియోజకవర్గంలో దెందులూరు మండలంలో 26 నీటి సంఘాలు ఉన్నాయి. ఏలూరు రూరల్ నియోజకవర్గంలో 10 నీటి సంఘాలున్నాయి. పెదపాడు మండలంలో 18 నీటి సంఘాలున్నాయి. పెదవేగి మండలంలో 17 నీటి సంఘాలున్నాయి. ఎన్నికైన నీటి సంఘం ఆయకట్టును పర్యవేక్షించడం, ఆయకట్టు చివరి భూమికి సైతం సాగునీరందేలా ఇరిగేషన్ అధికారులతో కలిసి పని చేయడం నీటి సంఘం విధులు.

నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సిద్ధం



ఇప్పటికే ఎన్నిన ప్రక్రియ ప్రారంభమైంది. నోటిఫికేషన్ వచ్చిన వారం రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తాం. ఓటరు జాబితా తహసీల్దార్ కార్యాలయంలో సిద్ధమయ్యాయి. ఆయకట్టు చివరి భూమికి సైతం సాగు నీరు అందించడం నీటి సంఘాల ప్రధాన లక్ష్యం.

– గనిరాజు, మైనర్ ఇరిగేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్